నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 24-1-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 149 | పేజీలు: 4 | వెల: రూ.1/-

టెన్త్ పరీక్షల షెడ్యూల్ ఖరారు

మే 17నుంచి26 వరకు పరీక్షలు

మే 26 నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పదో తగరతి పరీక్షల తేదీలు ఖరారు అయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రాంచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 9, 10వ తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించనున్నారు. పది పరీక్షలు ముగిసిన మరుసటి రోజు మే 26 నుంచి జూన్ 13వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. గతంలో ఆరు స్జబెక్టులకు 11 పరీక్షలు నిర్వహించేవారు. కానీ ఈసారి కేవలం ఆరు స్జబెక్టులకు ఆరు పరీక్షలు నిర్వహించనున్నారు. నాలుగు ఎఫ్ఏ టెస్టులకు గానూ రెండు ఎఫ్ఏ టెస్టులను మాత్రమే నిర్వహించనున్నారు. మొదటి ఎఫ్ఏను మార్చి 15న, రెండో ఎఫ్ఏ టెస్టును ఏప్రిల్ 15న నిర్వహించనున్నారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్‌ను మే 7 నుంచి 13వ తేదీ మధ్యలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. , 10వ తరగతుల విద్యార్థులు స్కూల్‌కు తప్పనిసరిగా హాజరు కావాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సరిపడా హాజరు శాతం లేనప్పటికీ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు అనుమతించనున్నారు. జిల్లాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు, హైదరాబాద్ జిల్లాలో ఉదయం 8:45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ క్లాసులైతే పదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య, 9వ తరగతి విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య నిర్వహించనున్నారు.

ఇందిరాపార్కు వద్ద ఉద్రిక్తత

ఉద్యోగ సంఘాల దీక్షను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): నగరంలోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్షకు దిగిన ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల ఐక్యవేదిక నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగుల నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు, పబ్లిక్ సెక్టార్, కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈహెచ్ఆర్‌ని ప్రకటించాలంటూ ఒక్కరోజు నిరాహార దీక్షకు పూనుకున్నారు. అయితే పోలీసులు అడ్డుకోవటంతో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగిన ఐక్య వేదిక నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

.బిఆర్‌కె భవన్‌లో నాబార్డ్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొన్న సిఎస్ సోమేశ్ కుమార్

అన్నాడీఎంకేను ఎదిరించే దమ్ము స్టాలిన్‌కు లేదు

ఎదురుదాడి ప్రారంభించిన సిఎం పళనిస్వామి

చెన్నై,జనవరి23(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గర పడుతుండటంతో తమిళనాడులో రాజకీయం రసకందాయంలో పడింది. అధికార అన్నాడీఎంకే, ప్రతిపక్ష డీఎంకే నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ గ్రామసభలు నిర్వహించి అన్నాడీఎంకే పాలనపై విమర్శలు గుప్పిస్తుండగా.. ఇవాళ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి స్టాలిన్‌పై విమర్శల వర్షం కురిపించారు. స్టాలిన్ నాయకుడిగా అసమర్థుడని, అన్నాడీఎంకేను నేరుగా ఎదిరించే దమ్ము, ధైర్యం స్టాలిన్‌కు లేవని పళనిస్వామి మండిపడ్డారు. తమను ఎదిరించే సత్తా లేకనే అధికార పార్టీకి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని తమిళనాడు సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తమ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వెళ్తుంటే, ప్రతిపక్ష డీఎంకే ప్రజలకు చెప్పుకునేందుకు ఏ అంశమూ లేక డ్రామాలాడుతున్నదని ఆయన విమర్శించారు. తాను రాజకీయాల్లో క్షేత్రస్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన వాడినని, కానీ, స్టాలిన్ ప్రస్తుత స్థాయికి అతని తండ్రి కారణమని ఆరోపించారు. ఎంజీ రామచంద్రన్, జయలలిత, తాము రాష్ట్ర ప్రజల కోసం పనిచేస్తే.. స్టాలిన్ తండ్రి కరుణానిధి మాత్రం తన కుటుంబం కోసం మాత్రమే పనిచేశాడని పళనిస్వామి ఆరోపించారు.

డీసీసీబీలను మరింత బలోపేతం చేయాలి : సీఎస్

ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేయాలి నాబార్డు సమావేశంలో సిఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): డీసీసీబీల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు వర్క్‌షాపులు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. డీసీసీబీల ద్వారా మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక యాప్ రూపొందించాలని, డీసీసీబీల పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఎస్ అధ్యక్షతన నాబార్డ్ మొదటి ఉన్నతస్థాయి కమిటీ సమావేశం జరిగింది. టెస్కాబ్ ద్వారా 795 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరైజేషన్ చేసి తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

రాష్ట్రంలో సహకార వ్యవస్థ పటిష్ఠతకు ఉన్నతస్థాయి కమిటీ సమర్పించిన నివేదికపై సమగ్ర వివరాలు అందజేయాలని సూచించారు. గ్రామగ్రామాలకు సేవలు అందించేందుకు కొత్త శాఖల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, టెస్కాబ్ అధ్యక్షుడు కే రవీందర్ రావు, కో-ఆపరేటివ్ సొసైటీల కమిషనర్, రిజిస్ట్రార్ ఎం వీరబ్రహ్మయ్య, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రోనాల్డ్ రోస్, నాబార్డ్ సీజీఎం వైకే రావు, జీఎం జేఎస్ ఉపాధ్యాయ, టెస్కాబ్ ఎండీ డాక్టర్ ఎన్ మురళీధర్, అధికారులు పాల్గొన్నారు

నేతాజీ స్ఫూర్తివంతమైన నాయకుడు

నివాళి అర్పించిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా

గువాహటి,జనవరి23(ఆర్ఎన్ఎ): అసోంలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర 'పరాక్రమ్ దివస్' నిర్వహించాలని ప్రకటించారని అన్నారు. బోస్ ధైర్యసాహసాలు భారత స్వాతంత్ర్య పోరాటానికి కొత్త శక్తిని ఇచ్చాయన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో తన ఆకర్షణీయమైన నాయకత్వంతో దేశంలోని యువతను సంఘటితం చేశారని కొనియాడారు. అమిత్ షా అసోం, మేఘాలయాల్లో రెండు రోజుల పాటు పర్యటించను న్నారు. గువాహటిలోని పారా మిలటరీ దళాల కోసం 'ఆయుష్మాన్ సీ ఏపీ ఎఫ్' పథకాన్ని హోంమంత్రి ప్రారంభించారు. అలాగే ఆదివారం షిల్లాంగ్‌లో జరిగే నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (ఎన్ఈసీ) ప్లీనరీ సెషన్స్‌కు చేరుకోనున్నారు. అనంతరం మళ్లీ అసోంకు చేరుకొని బోడోల్యాండ్ టెరిటోరియల్ రీజియన్ ఒప్పందంపై సంతకం చేసిన రోజు సందర్భంగా నిర్వహించే మొదటి వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

నేతాజీ స్ఫూర్తిగా సమసమాజ నిర్మాణం సాగాలి

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక, లింగవివక్ష, కులతత్వం, మతతత్వం వంటి సామాజిక దురాచారాలు లేనటువంటి సమాజ నిర్మాణం దిశగా యువత కృషి చేయాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 125వ జయంతిని పురస్కరించుకుని 'పరాక్రమ దివస్' నేపథ్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న అధికారులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. అంతకు ముందు నేతాజీ చిత్రం వద్ద నివాళులు అర్పించారు. మన దేశ జనాభాలో 65 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగి ఉన్నారని, ప్రతి పౌరుడు సమాన అవకాశాలను పొందే, వివక్షకు తావులేని సంతోషకరమైన, సుసంపన్నమైన నవభారత నిర్మాణంలో పాలు పంచుకునే దిశగా ముందుకు రావాలని సూచించారు. నేతాజీ వ్యక్తిత్వంలో పరాక్రమం ప్రతిబింబిస్తుందని, ఆయన జయంతిని దేశ ప్రజల్లో స్ఫూర్తిని రగిలించే విధంగా పరాక్రమ దివస్‌గా జరుపుకో వాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్యోద్య మంలో నేతాజీ పోషించిన పాత్ర నిరుపమా నమైనదని, కులం, మతం, ప్రాంతం, భాష వంటి ఇతర గుర్తింపులకు అతీతంగా మన మంతా భారతీయులమని బోస్ ప్రగాఢంగా విశ్వసించారని తెలిపారు. కుల వ్యవస్థలేని భారతదేశాన్ని నేతాజీ ఆకాంక్షించారని నొక్కి చెప్పారు. 1940 ల్లోనే అన్ని కులాలు, మతాలకు చెందిన సైనికులంతా కలిసి ఒకే రకమైన వంటలతో సహపంక్తి భోజనాలు చేసే దిశగా ఆయన స్ఫూర్తిని రగిలిం చార న్నారు. నేతాజీ స్ఫూర్తిదా యక లక్షణా లను ప్రస్తావిస్తూ.. యుద్ధ ఖైదీలుగా ఉన్న సైనికులను ఉత్సాహపరచి, వారిలో స్ఫూర్తిని రగిలించి స్వాతంత్ర్య సమరయోధులుగా మలచారని, నేతాజీ లాంటి నాయకుడి కోసం వారంతా స్వరాజ్య సాధన కోసం తుది శ్వాస వరకూ పోరాడేందుకు సిద్ధమ య్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ హర్‌ప్రీత్ సింగ్, అదనపు డైరెక్టర్ జనరల్ బెన్‌హుర్ మహేష్ దత్ ఎక్కా, అధ్యాపక సిబ్బంది, శిక్షణ పొందుతున్న అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

మరంపల్ల భూములపై ఆందోళన వద్దు

రైతులను కలిసిన ఎమ్మెల్యే సైదిరెడ్డి

సూర్యాపేట,జనవరి23(ఆర్ఎన్ఎ): మరంపల్లి మండలంలోని సర్వే నెంబర్ 540లో వివాదాస్పద భూములను స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శనివారం పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమాయక గిరిజనుల మధ్య వివాదాలు సృష్టిస్తే సహించేది లేదని, రైతులపై దాడి చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గతంలో గిరిజనులపై దాడిచేసి వారిపై కేసులు పెడితే తానే బెయిల్ ఇప్పించి తీసుకువచ్చానని చెప్పారు. వివాదాస్పద భూముల వివరాలను తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా అసెంబ్లీ సాక్షిగా స్పందించారని గుర్తుచేశారు. సర్వే నెంబర్ 540 భూములపై ఎక్కడైనా.. ఎప్పుడైనా తాను చర్చకు సిద్ధమని, ఉత్తమ్ కుమార్ రెడ్డి సిద్ధమేనా అని సవాల్ విసిరారు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని అన్నారు. అర్హులందరికీ పట్టాలు ఇప్పించే బాధ్యత తనదేనని ఎవరూ అధైర్య పడొద్దని చెప్పారు. కొందరు రాజకీయాల కోసం అమాయక రైతులను ఆగం చేస్తున్నారని, అలాంటి వారి మాటలు వినొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

జైలు నుంచి భూమా అఖిలప్రియ విడుదల

హైదరాబాద్, జనవరి 23: బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ నాయకురాలు, ఏపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఇవాళ సాయంత్రం జైలు నుంచి విడుదలైంది.

అఖిలప్రియ జైలు నుంచి విడుదల అవుతుండటంతో ఆమె బంధువులు, అభిమానులు చంచల్‌గూడ జైలు వద్దకు చేరుకున్నారు. శుక్రవారం ఆమెకు సికింద్రాబాద్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తుతోపాటు ఇద్దరు ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది.

ప్రతి 15 రోజులకు ఒకసారి బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లాలని కోర్టు ఆమెకు సూచించింది. ప్రవీణ్ సోదరుల అపహరణ కేసులో భూమా అఖిల ప్రియ ప్రధాన నిందితురాలిగా ఉండగా ఆమె భర్త భార్గవ్ రామ్ ఏ-3గా ఉన్నారు. కేసు వెలుగులోకి వచ్చిన నాటి నుంచి భార్గవ్ రామ్ పరారీలో ఉన్నారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సైతం కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

డిజిటల్ రంగంలో పోటీపడేలా చేయడమే లక్ష్యం

ట్రైబల్ డిజిటల్ లీడర్‌షిప్‌పై మంత్రి సత్యవతి

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజన మహిళలు డిజిటల్ రంగంలో అందరితో పోటీపడేలా చేయడమే లక్ష్యంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రైబల్ డిజిటల్ లీడర్ షిప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 150 మంది మహిళలకు డిజిటల్ పరికరాలపై శిక్షణ ఇచ్చామని, మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో శనివారం మరో 55 మందికి అందజేసినట్లు ఆమె తెలిపారు. విద్య ఒకటే సమాజంలోని అసమానతలు తగ్గిస్తుందని భావించిన సీఎం కేసీఆర్ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. దళితులు, గిరిజనులు, పేదల అభ్యున్నతికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు అవసరమని అన్నారు. డిజిటల్ లీడర్ షిప్ ప్రోగ్రాంలో మరింత మందిని భాగస్వామ్యం చేయాలని నిర్మాణ్, సర్వీస్ నౌ స్వచ్ఛంద సంస్థలను కోరారు. ఆడపిల్ల చదువుకుంటే కుటుంబానికే కాకుండా సమాజానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టియానా, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, అదనపు సంచాలకుడు సర్వేశ్వర్ రెడ్డి, నికోలస్, సంయుక్త సంచాలకులు సముజ్వల, మయూర్, నిర్మాణ సంస్థ నిర్వాహకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇక మొబైల్‌లోనే ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

హైదరాబాద్, జనవరి 23: ఓటరు గుర్తింపు కార్డును ఓటర్లు తమ మొబైల్‌లోనే డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటును భారత ఎన్నికల సంఘం కల్పించింది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ ద్వారా పీడీఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ సైతం తీసుకోవచ్చు. ఇప్పటి వరకూ ఓటరు గుర్తింపు కార్డును మీసేవా కేంద్రాల ద్వారానే పొందే అవకాశం ఉండేది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న ఈ-ఎపిక్ (ఎలక్ట్రానిక్ ఫొటో ఐడెంటిటీ ఓటరు కార్డు) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నామని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి కార్యాలయం తెలిపింది.

ఓటరు తమ మొబైల్‌లోనే ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, ఎక్కడైనా ప్రింట్ తీసుకోవచ్చునని వెల్లడించింది. ఈ-ఎపిక్ విధానంపై ఓటర్లలో అవగాహన పెంచాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. కొత్తగా నమోదైన ఓటర్లు ఈ నెల 25 నుంచి 31 వరకు తాము రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నెంబర్ ద్వారా ఈ- ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 1 నుంచి ఓటర్లందరూ డౌన్లోడ్ చేసుకోవచ్చు. నూతనం విధానంపై 'ఈ-ఓటర్ హువా డిజిటల్, క్లిక్ పర్ ఏపిక్' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. పోర్టల్ : http://voterportal.eci.gov.in, NVSP:https://nsvp.in ఓటర్ హెల్ప్ లైన్, మొబైల్ యాప్ ఆండ్రాయిడ్ https://play.google.com/store/apps/details?id=com.eci citizen ఐఓఎస్ ద్వారానైతే http://apps.apple.com/in/app/voter-helpline/id1456535004ల ద్వారా ఎలక్ట్రానిక్ ఓటరు గుర్తింపు కార్డు డౌన్ లోడ్ చేసుకో వచ్చని తెలిపింది. అన్నీ ఒకే యాప్లో నమస్తే తెలంగాణ ఆండ్రాయిడ్ యాప్ డౌన్లోడ్ చేసుకోండి.

నేతాజీకి నివాళి అర్పించిన బండి

హైదారాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. నేతాజీకి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారిని దేశం నుంచి పారదోలడానికి నేతాజీ చేసిన కృషిని ఆయన కొనియాడారు. నేతాజీ జయంతిని 'పరాక్రమ్ దివస్'గా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజును స్థాపించి యువతలో దేశభక్తిని రగిలించాడన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం





మోడీ వైఫల్యానికి పరాకాష్ట..పెట్రో ధరలు !

నేటినిజం
ఆదివారం 24-1-2021

సామాన్యుడు బతకడమెలా అన్నది ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. ఏం చేస్తే బాగుపడతారు..ఎలా చేస్తే ఉపాధి దొరుకుతుంది..ఏ పథకాల వల్ల నిరుద్యోగం పోతుంది.. ఏం చేస్తే రైతులు బట్టకట్టి బతుకుతారు.. నిరుద్యోగులకు ఉపాధి లేదా ..ఉద్యోగం కల్పించడం ఎలా అన్నది పాలకులు విస్మరించారు. తాము చేసేదే గొప్ప అన్న రీతిలో పాలకులు ముందుకు సాగుతున్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి కావచ్చు..రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు కావచ్చు...ప్రజలను దృష్టిలో పెట్టుకుని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగడం లేదు. ఉన్నదాంట్లో సర్దుకుని బతుకుదామనుకున్న ప్రజలను నిద్రపోకుండా చేస్తున్నారు. భవిష్యత్తు మీద, దేశ ప్రజల మీద ఆలోచనలు లేని ప్రభుత్వాలు ప్రజల మీద స్వారీ చేస్తున్నాయి. కరోనాతో పూర్తిగా దివాళా తీసిన ప్రజలపై ధరలతో దాడులు చేస్తున్నారు. వారి నడ్డివిరిగి లేవలేని విధంగా మోదుతున్నారు. కట్టేసి కొడితే భరించక చస్తాడా అన్న రీతిలో పాలకుల తీరు ఉంది. తాజాగా దేశంలో ఇంధన ధరలు మళ్లీ పరుగులు పెడుతున్న తీరు చూస్తుంటే పాలకుల నిర్లక్ష్యానికి ప్రజలు బలవుతున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కేంద్రం సామాన్యుల గురించి మాట్లాడడం లేదు. అధికార బిజెపి ఎంపి సుబ్రమణ్యస్వామి కూడా పెట్రో ధరల పెంపును సర్కార్ వ్యాపారంగా అభివర్ణించారు. ఇంతకంటే ఉదాహరణ అక్కర్లేదు. చాయ్‌వాలా నని ఘనంగా చెప్పు కుంటున్న ప్రధాని మోడీ గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా..రెండు సార్లు ప్రధానమంత్రిగా వెలుగొందుతున్నా.. సామాన్యుల నాడీ పట్టడంలో విఫలమయ్యారు. జిఎస్టీ పేరుతో లక్షల కోట్లు వసూలు చేయడం పరమావధిగా ఆయన ప్రభుత్వం సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. పెట్రోల్,డీజిల్ ధరలతో ఓ రకంగా చెప్పాలంటే సర్కార్ వ్యాపారం చేస్తుందనే చెప్పాలి. ఇబ్బడిముబ్బడిగా పన్నులు పెంచుతూ దానిని ప్రజలకు అంద కుండా చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకు రవాణా భారం పెరిగి వివిద రకాల వస్తువులపైనా ధరల మోత మోగుతుందన్న ఇంగితం లేని వారు మన పాలకులుగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పెట్రోల్ అన్నది సామాన్యుని వస్తువు.

కార్లు, టూ వీలర్లు ఇప్పుడు సామాన్యుల కోసం మాత్రమే అని గుర్తించాలి. రవాణా కోసం వారు వీటిని ఉపయోగించక తప్పడం లేదు. మనదేశంలో సరైన ప్రజారవాణా లేకపోవడం వల్ల సామాన్యులు సైతం టీవీర్లను, కార్లను ఉపయోగిస్తున్నారు.

ఇదేదే ధనవంతుల విషయంగా భావించి ధరలతో బాదడం కేంద్ర పాలకుల వైఫల్యం తప్ప మరోటి కాదు. . గతేడాది అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు కేంద్రం దేశంలో ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అయితే ఇప్పుడు ఇంధన ధరలు మండిపోతుండటంతో వినియోగ దారులపై భారాన్ని తగ్గించేందుకు సుంకాన్ని తగ్గించాల్సి కేంద్రం,రాష్ట్రాలు దాని గురించి ఆలోచించడం లేదు. తాజాగా పెట్రోల్, డీజిల్‌పై 25పైసలు చొప్పున పెరిగింది. దీంతో దేశ రాజధాని దిల్లీలో లీటరు పెట్రోల్ రూ.85.70కి చేరింది. వాణిజ్య రాజధాని ముంబయి లో పెట్రోల్ ధర రికార్డు స్థాయిలో రూ.92.28గా ఉంది. హైదరాబాద్‌లోనూ 26పైసలు పెరిగి రూ.89.15కు చేరింది. పెరిగిన ధరలతో లీటర్ డీజిల్ ధర దిల్లీలో రూ.75.88, ముంబయిలో రూ.82.66, హైదరాబాద్‌లో రూ.82.80గా ఉంది. మొత్తంగా చూస్తే వంద మార్కును దాటేలా కనిపిస్తోంది. సత్యవచనాలు పలుకుతున్న బిజెపి నేతలు ఈ విషయంలో ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి.

దేశంలో వరుసగా చమురు ధరలు వరుసగా పెంచుతూ వస్తున్న పెట్రో కంపెనీలు ఇటీవలే గ్యాస్ సిలిండర్ రేట్లను పెంచాయి. ఇప్పటికే ధరలమోత, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్య దేశంలో వంటగ్యాస్ భారం కూడా సామాన్యుల పై పడింది. తాజాపెంపుతో ఒక్కో సిలిండర్‌పై రూ.50 భారం పడింది. ఇప్పటికే పెట్రో ధరల సెగతో ఇబ్బంది

పడుతున్న సామాన్యులపై గ్యాస్ పిడుగు పడింది. దేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఎల్పీజీ ధరలు ఒక్కో రకంగా ఉండటంతో సిలిండర్ ధరల్లో హెచ్చు తగ్గులు ఉంటాయి. కరోనా కారణంగా ఎప్పుడూ లేనంతగా ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతింది. పెద్దఎత్తున ఉద్యోగాలు మాయమయ్యాయి. ప్రజలు ఆదాయాలు సైతం పడిపోయాయి. ఏదైనా కొత్త వైరస్ పేరు చెబితేనే ప్రజలు వణికిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. బతకడమెలా అన్న దుర్భర పరిస్థితులు ఉన్నాయి. ఈ దశలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు కారణంగా ప్రజలు చావడమెలా అన్న ఆలోచన చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. యువ భారత్‌ను ఏళ్లుగా నిరుద్యోగ సమస్య వెంటాడుతోంది. ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీనికితోడు కొవిడ్ వైరస్ కత్తి దూయడంతో పెద్దఎత్తున ఉద్యోగాలు పోయాయి. దీంతో తక్షణమే ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నా.. వాటిని ప్రభుత్వాలు విస్మరించాయి. ఇందుకోసం మౌలిక సదుపాయాల కల్పన, తయారీ రంగం, రియల్ ఎస్టేట్ రంగాలకు కేంద్రం విరివిగా ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే, దేశంలో ఎక్కువ మంది ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలు కొవిడ్ కారణంగా చతికిల పడ్డాయి. ఇవి కోలుకోవాలంటే కేంద్రం చేయూత తప్పనిసరి. కరోనా విజృంభించిన వేళ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు చాలక,వైద్యంపై నమ్మిక లేక ఇబ్బందులెదురయ్యాయి. వైద్యసేవల కోసం ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించిన వారికి ఫీజుల రూపంలో చుక్కలు కనిపించాయి.

ఇలా కూడా ప్రజలు అప్పులు చేసి అవస్థలు పడ్డారు. దేశంలో యువతకు ఉద్యోగాలను కల్పించాలంటే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడం కీలకం. భవిష్యత్‌లో ప్రభుత్వ ఖజానాకు స్థిర ఆదాయం రావాలన్నా, పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రావాలన్నా ఇందులో ప్రభుత్వ పెట్టుబడులు ముఖ్యం. ఇలాంటి ఆలోచనలు చేయకుండా పెట్రోల్,గ్యాస్ ధరలు పెంచుతూ పోతే ప్రజలు భరించగలరా లేదా అన్నది ఆలోచన చేయాలి. కానీ అలాంటి ఆలోచనలు చేయడంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిగా విఫం చెందింది. ప్రజలను పట్టించుకోని పాలన సాగడంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలి. లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదు.

జింబాబ్వేలో కోరలు చాస్తోన్న కరోనా

ఇప్పటికే ముగ్గురు మంత్రుల మృతితో ఆందోళన

హరారే,జనవరి23(ఆర్ఎన్ఎ): జింబాబ్వేలో కరోనా కోరలు చాస్తోంది. కేవలం వారం వ్యవధిలోనే కరోనాతో ముగ్గురు మంత్రులు కన్నుమూశారు. శుక్రవారం ఆ దేశ రవాణా, మౌలికసదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి జోయల్ మటీజా కరోనాతో మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. బుధవారం విదేశీ వ్యవహారాల మంత్రి శిబుసిసో మోయో బుధవారం మరణిఇంచగా...జనవరి 15వతేదీన మనికాలాండ్ మంత్రి ఎల్లన్ గ్వార్డజింబా కోవిడ్‌కు బలయ్యారు. కాగా, మరో మాజీ మంత్రి సైతం కరోనాతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మాజీ విద్యాశాఖ మంత్రి అనియాస్ చిగ్వేడర్ కోవిడ్ సంబంధిత సమస్యలతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. జింబాబ్వే దేశంలో గత 24 గంటల్లో 639 మంది కరోనా బారిన పడ్డారు. జింబాబ్వేలో 30వేల కరోనా కేసులు నమోదయ్యాయి. కాగా, ముగ్గురు మంత్రులు కోవిడ్‌తో మృతి చెందడం ఇప్పుడు అక్కడ కలవరం కలిగిస్తోంది.

పాతనోట్లకు ఇక పాతర

మాయం కానున్న వంద, పది, ఐదు రూపాయల నోట్లు

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): అనూహ్యంగా పెద్ద నోట్ల రద్దుతో దేశ ప్రజలకు షాకిచ్చిన కేంద్రం మరో కీలక నిర్ణయాన్ని తీసుకోబోతోంది. 2021 ఏడాదిలో మరో షాకింగ్ నిర్ణయం దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోచిస్తోంది. తాజా సమాచారం ప్రకారం మార్చి లేదా ఏప్రిల్ నాటికి ప్రస్తుతం చలామణిలో ఉన్న కొన్ని పాత కరెన్సీ నోట్లను విత్‌డ్రా చేసుకునే ఆలోచనలో ఉంది. ఈ మేరకు ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బీ మహేష్ సూచనప్రాయంగా వెల్లడించారు.రూ.100, రూ .10, రూ .5 పాత కరెన్సీ నోట్లను ఆర్‌బీఐ ఉపసంహరించుకోనుందనే హింట్ ఇచ్చారు. అలాగే 10 రూపాయల నాణెం ప్రవేశపెట్టి 15 సంవత్సరాల తరువాత కూడా వ్యాపారులు, వ్యాపారవేత్తలు సహా చాలామంది వాటిని అంగీకరించడానికి ఇష్టపడ్డంలేదన్నారు. నకిలీవని వారు అనుమానిస్తుండటంతో బ్యాంకులు, ఆర్‌బీఐకి సమస్యగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో 10 రూపాయల నాణెంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే మరి పాత నోట్లను మార్చుకునేందుకు ఎంత సమయం ఇస్తుంది అనేదానిపై క్లారిటీ లేదు. దీనికి సంబంధించి ఆర్‌బీఐ అమలుచేయనున్న సమగ్ర ప్రణాళిక, విధివిధానాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. కాగా నవంబర్ 8, 2016లో రూ.500,1000 రూపాయల నోట్ల డీమానిటైజేషన్ తర్వాత రూ .2,000 విలువైన కరెన్సీ నోట్‌తో పాటు రూ .200 నోటును ప్రవేశపెట్టింది. 2019లో 100 రూపాయల విలువైన కొత్త కరెన్సీ నోట్లను తీసుకొచ్చింది. 2019 లో, సెంట్రల్ బ్యాంక్ రూ.2000 నోట్ల ముద్రణను నిలిపివేసినట్లు ఇచ్చిన ఆర్టిఐ సమాధానంలో ఆర్‌బీఐ వెల్లడించింది. దీంతో త్వరలోనే 2వేల నోటును కూడా రద్దు చేయనుందనే వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే అలాంటి ఆలోచన ఏదీ లేదని కేంద్రం, ఆర్‌బీఐ అప్పట్లోనే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

కావలి వద్ద రోడ్డు ప్రమాదంలో వేములవాడవాసి మృతి

వేములవాడ,జనవరి23(ఆర్ఎన్ఎ): నెల్లూరు జిల్లా కావలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి మృత్యువాతపడగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

వేములవాడ పట్టణం అంజనీనగర్‌కు చెందిన లాల దేవయ్య కుటుంబీకులు తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో బయలుదేరారు. స్వామి వారిని దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో శనివారం నెల్లూరు జిల్లా కావలి వద్ద దేవయ్య కుటుంబం ప్రయాణిస్తున్న కారును టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో లాల దేవయ్య (58) అక్కడికక్కడే మృతిచెందాడు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడ్డ వారిని హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేతాజీ ఆశయాలను విస్మరించిన బిజెపి

కోల్‌కతా ర్యాలీలో మమత మండిపాటి

కోల్‌కతా,జనవరి23(ఆర్ఎన్ఎ): నేతాజీ సుభాష్ చంద్రబోస్ ముందుచూపున్న మహానాయకుడని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి గుర్తుచేసుకున్నారు. నేతాజీ 125వ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని శ్యామ్ బజార్ నుంచి రెడ్ రోడ్ వరకు జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న మమతాబెనర్జీ ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు.

స్వతంత్ర్య భారతదేశానికి ప్రణాళికా సంఘం, ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆవశ్యకతను నేతాజీ స్వాతంత్ర్యానికి పూర్వమే ఊహించారని మమతాబెనర్జి చెప్పారు. అయితే, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా బీజేపీ వ్యవహరిస్తున్న తీరును మమతాబెనర్జీ తప్పుబట్టారు.

నేతాజీపై నిజంగా గౌరవం ఉంటే ఆయన ఆశయాలను తూచా తప్పకుండా నెరవేర్చాలని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీజేపీ మాత్రం నేతాజీ ముందు చూపుతో ఏర్పాటైన ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి ఆయన విగ్రహాలను మాత్రం ఆరాధిస్తున్నదని ఆమె ఎద్దేవా చేశారు.

ప్రజల అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ

రోడ్డు భద్రతా మాసోత్సవంలో బైక్ ర్యాలీలో మంత్రి

ఖమ్మం,జనవరి23(ఆర్ఎన్ఎ):ప్రజల సహకారంతోనే రోడ్డు భద్రతను పెంపొందించడం సాధ్యమవుతుందని మంత్రి అజయ్ కుమార్ అన్నారు. ప్రయాణంలో వాహనఛోదకులు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు.

రెండో ప్రపంచయుద్ధంలో మరణించిన వారికంటే ఒక ఏడాదిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువమంది చనిపోతున్నారని చెప్పారు.

సమష్టి కృషితో భద్రతా ప్రమాణాలను నిరంతరం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో కవిలి నిద్ర నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు సాగిన ఈ బైక్ ర్యాలీలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, జిల్లా కలెక్టర్ కర్ణన్, పోలీస్ కమిషనర్ తఫ్సిర్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

కరోనా కష్టాలకు బడ్జెట్‌లో ఊతం దక్కేనా

దేశ అర్థిక పరిస్థితులను మదింపు చేసే చర్యలు ఉంటాయా
ఉపా,ఉద్యోగ రంగాలకు ప్రోత్సాహం దక్కేనా
దెబ్బతిన్న రంగాలను గట్టెక్కించేలా ఉపశమన చర్యలు ఉంటాయా
దేశప్రజల్లో బడ్జెట్‌పై పెరుగుతున్న అంచనాలు

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): కరోనా కష్టాలను అనుభవిస్తున్న తరుణంలో మోడీ ప్రభుత్వం మరోమారు ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నది. ప్రజలంతా నిస్సత్తువగా ఆశగా చూస్తున్న వేళ బడ్జెట్‌పై అంచనాలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒకవైపు ఆర్థిక వ్యవస్థ ఉత్తేజానికి చర్యలు చేపడుతూనే దీర్ఘకాలంగా ఉన్న నిరుద్యోగం, ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. ఇంతకీ ఈసారి బడ్జెట్‌లో ఎదురు కాబోయే ముఖ్యమైన సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటారా అన్నది చూడాలి. ప్రధానంగా దేశంలో కరోనా అనంతరం ఇప్పుడిప్పుడే ప్రజల కొనుగోళ్లు పెరిగి డిమాండ్ ఊపందుకుంది. గత కొన్ని నెలలుగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటమే ఇందుకు కొలమానం. అయితే, ప్రజల ఆదాయాలు మునుపటి స్థాయిలో లేని కారణంగా ఈ డిమాండ్ ఎంతకాలం కొనసాగుతుందనేది ప్రశ్నే. అయితే, డిమాండ్‌ను పెంచే చర్యలను ఈ బడ్జెట్‌లో చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం కొన్ని రాయితీలు ప్రకటించడం అనివార్యం కావాలి. కరోనా సంక్షోభం తర్వాత అన్నీ ఇప్పుడిప్పుడే సర్దుకుంటూ.. వ్యాక్సిన్ కూడా వచ్చేసింది. ఈ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్టింగ్ ఇచ్చే బాధ్యత కేంద్ర ఆర్థిక మంత్రిపై ఉంటుంది. ఇలాంటి ప్రతికూల సమయంలో పెడుతున్న బడ్జెట్ తయారీ విషయంలో మంత్రి నిర్మలా సీతారామన్‌పై కనిపించని ఒత్తిడి, భారం మాటల్లో చెప్పలేం. కరోనా సమయంలో బాగా దెబ్బతిన్న రంగాలను గాడిలో పెట్టాల్సిన సమయం కావడంతో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ఎలాంటి నిర్ణయాలు, కేటాయింపులు చేయాలన్నదే చాలా కీలక అంశం. కరోనా కారణంగా దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాలలో అనేక మంది ఉద్యోగాలు, ఉపాధిని కోల్పోయి కనీసం బతుకు బండిని నడిపించడానికి కూడా చాలా అవస్థలు పడ్డారు. వారికి ఆశాదీపంలా బడ్జెట్ ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు. బడ్జెట్ అనగానే సగటు మనిషి ఎదురు చూసేది ఆదాయపు పన్ను శ్లాబు గురించే. వార్షికాదాయం రూ.5లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించాలన్న డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. అయినా, గత కొన్ని బడ్జెట్‌ల నుంచి ఆ ఊసే లేకుండా పోయింది. ఇటీవల జరిపిన ఓ సర్వేలో బడ్జెట్‌లో 40 శాతం మంది పన్ను ఊరట గురించే ప్రస్తావించడం బట్టి వారి ఆకాంక్షను అర్థం చేసుకోవచ్చు. పైగా కొవిడ్ కారణంగా ఆదాయాలు పడిపోయిన నేపథ్యంలో ఈ సారి ఈ డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది. వేతన జీవికి ఊరట కల్పించే ఈ నిర్ణయంపై ఆర్థికమంత్రి ఆలోచనల ఎలా ఉన్నాయో చూడాలి. కరోనా సంక్షోభం కారణంగా అతలాకుతలమైన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉంటుందా? కరోనా దెబ్బకు కుదేలైన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు ఉంటాయా? వరాలు ప్రకటిస్తారా లేక పన్నులు వడ్డిస్తారా? లాంటి ఎన్నో ప్రశ్నలు ప్రతి ఒక్కరిలో ఉన్నాయి. కరోనా మహమ్మారి ఆర్థిక వ్యవస్థను కుదిపేసిన తర్వాత మోడీ సర్కార్‌కు ఇది తొలి బ్జడెట్ కావడంతో అటు ప్రభుత్వ, ప్రతిపక్ష, పారిశ్రామిక వర్గాల్లోనే కాకుండా ఇటు సామాన్య ప్రజలు సైతం ఈ బడ్జెట్‌పై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇంతకుముందెన్నడూ లేనిదిగా ఈ బడ్జెట్ తయారు చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరికీ కేంద్ర బడ్జెట్ పై ఆశలు, అంచనాలు పెరిగిపోయాయి. కొవిడ్-19 పుణ్యమా అని మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో లోటు పాట్లు బయటపడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు కేటాయింపులు పెంచాల్సి ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే ఆరోగ్య సంరక్షణకు మన దేశం వెచ్చిస్తున్న మొత్తం తక్కువగా ఉందనే చెప్పాలి. భవిష్యత్‌లో ఇలాంటి వైరస్‌లు వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను చక్కదిద్దు కోవాలి. జీడీపీలో కనీసం ఈ రంగానికి 2.5 శాతం కేటాయింపులు జరపాలి. దేశంలో యువతకు ఉద్యోగా లను కల్పించాలంటే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడం కీలకం. భవిష్యత్‌లో ప్రభుత్వ ఖజానాకు స్థిర ఆదాయం రావాలన్నా, పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను రావాలన్నా ఇందులో ప్రభుత్వ పెట్టుబడులు ముఖ్యం. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వంటి వాళ్లు సైతం మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడుల అవసరాన్ని పలుమార్లు ప్రస్తావించారు. దీంతో పాటు ద్రవ్యలోటును అధిగమించడం, ఆత్మనిర్భర్ భారత్ సాధించే దిశగా అడుగులు వేయడం వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో కీలకం కానున్నాయి. మరి ఈ సవాళ్లను ఎలాంటి పరిష్కార మార్గాలు చూపుతారో చూడాలి. కరోనా మహమ్మారి వైద్య రంగంలోని లోటుపాట్లను ఎత్తిచూపింది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని బ్జడెట్‌లో కేటాయింపులు భారీగా పెంచాలి. వైద్య రంగానికి విడిగా ఒక 'నిధి' ని ఏర్పాటు చేయడంతో పాటు వైద్య రంగంలో పరిశోధనలకు మరిన్ని నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వైద్య రంగంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బలోపేతం చేయాలి. ప్రస్తుతం జీడీపీలో 1.4 శాతంగా ఉన్న వైద్య రంగ వ్యయాన్ని 2024 నాటికి 4శాతానికి పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం విధించుకున్న లక్ష్యాన్ని అందుకునేలా కేటాయింపులు ఉండాలి. గత బడ్జెట్‌లో కేంద్రం ఆరోగ్య సేవల రంగానికి రూ.67,484 కోట్లు కేటాయించింది. కరోనా ముప్పు వల్ల ఈ కేటాయింపులు చాలలేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల పెంపు, అసంఘటిత రంగాలు బలోపేతం చేయడం, మార్కెట్ గిరాకీ పెంచడం, దెబ్బతిన్న అన్ని రంగాలను గాడిలో పెట్టడం, పన్నుల భారం వేయకుండా, జనాల కొనుగోలు శక్తి పెంచేలా నిర్ణయాలు, కేటాయింపులు ఉండాల్సిన కీలక బడ్జెట్ ఇది. కరోనా కారణంగా ఎక్కువ దెబ్బపడింది టూరిజంపైనే. ప్రత్యేకించి విమానయానం, హోటళ్ల బిజినెస్ దారుణంగా దెబ్బతిన్నది. లక్షల మంది నిరుద్యోగులుగా మారారు. ఆ రంగాలను ఆదుకునేందుకు వాటిలో ఈక్విటీ పెట్టుబడులు పెట్టడం, పన్ను రిబేట్లు, పన్ను రాయితీలు కల్పించడం చాలా అవసరం. అదేవిధంగా భారీ వివాహాల వంటి ఎలాంటి వేడుకలు లేకపోవడంతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగం కుంగిపోయింది. ఆ రంగానికి అండగా నిలిచే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయాలి. ఉపాధి కల్పనకు మరో ప్రధాన రంగం రియాల్టీ ,హౌసింగ్. దేశంలో అసంఘటిత రంగానికి చెందిన కోట్లాది మంది కార్మికులు ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. ఈ రంగానికి ఇప్పటికే ప్రకటించిన పన్ను రిబేట్లు, రాయితీలను మరింతగా పెంచే అంశాలు ఈ బ్జడెట్‌లో ఉంటే మేలు. ముఖ్యంగా ఎంఐజీల అర్హత, ప్రిన్సిపల్, వడ్డీ తిరిగి చెల్లింపు పరిమితులు పెంచితే ఈ రంగంలో డిమాండ్ పెరుగుతుంది. రియాల్టీ, హౌసింగ్ రంగంపై ఆధారపడ్డ సిమెంట్, ఐరన్, పెయింట్ వంటి ఇతర ఉప రంగాలు ప్రభావితమై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దీని ద్వారా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి జనాలకు పనులు పెరిగితే వాళ్లకు కొనుగోలు శక్తి మెరుగవుతుంది. దీని ద్వారా మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. పారిశ్రామిక రంగంలో ఉపాధి పెంచే ఉద్దీపనాలు ఈ బడ్జెట్ లో ఉండాలని ఆ వర్గాల ప్రతినిధులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా మైక్రో, స్మాల్, మీడియం స్కేల్ పరిశ్రమ పన్నుల చెల్లింపుల విషయంలో ఒక ఏడాది పాటు రాయితీలు ప్రకటించాలని కోరుకుంటున్నారు. మన దేశంలో 50 శాతంఎగుమతులు మైక్రో, స్మాల్, మీడియం స్కేల్ సంస్థల ద్వారా జరుగుతున్నాయి. కాబట్టి వాటి ఉత్పత్తులపై ఎక్స్‌పోర్ట్ ట్యాక్స్ తగ్గించాలి. గడిచిన కొన్ని నెలలుగా జీఎస్టీ వసూళ్లు పెరిగినప్పటికీ, మార్కెట్లో గిరాకీ లేకపోవడంతో పరిశ్రమల టర్నోవర్ పెరగడంలేదు. ఉపాధి అవకాశాలు పెరిగితేనే మార్కెట్లో కొనుకోలు శక్తి పెరిగి గిరాకీ ఏర్పడుతుంది. బీమా, పింఛన్ విభాగాల్లో 49శాతం వరకు విదేశీ పెట్టుబడులను అనుమతిస్తున్నారు. ఈ రంగంలో ఎఫ్‌డీఐలను 75 శాతం వరకు అనుమతించాలన్నది దీర్ఘకాల డిమాండ్. ఈ నేపథ్యంలో ఆ రంగంలోకి విదేశీ పెట్టుబడులు మరింతగా వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మరోవైపు ప్రస్తుత సంక్షోభ పరిస్థితులలో పరిశ్రమలకు కావలసిన 'వర్కింగ్ కాపిటల్'ను సమకూర్చడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలి. గతంలో మౌలిక వసతుల రంగానికి నిధులు సమకూర్చిన ఐడీబీఐని బ్యాంకుగా మార్చడంతో ఇన్‌ఫ్రా నిధుల కల్పనలో అగాథం ఏర్పడింది. ఆ గ్యాప్‌ని పూడ్చేందుకు ప్రత్యేకంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్ ఏర్పాటుకు బ్జడెట్‌లో ప్రతిపాదించొచ్చు. అలాగే ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బాకీలు మార్చి నాటికి 12.5 శాతానికి పెరుగుతాయన్న అంచనాలు ఉన్నాయి. వాటి నిరోధానికి సంబంధించి కూడా బ్జడెట్‌లో ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితులలో పన్నులు పెంచి ప్రజలపై భారం వేయడం ఏమాత్రం మంచి ఆలోచన కాదు. ట్యాక్సులు పెంచితే మార్కెట్‌లో డిమాండ్ పడిపోయే ప్రమాదం ఉంది. అందుకని కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయం పెంచుకోవాలి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు పెంచాలి. ముఖ్యంగా కొత్త వ్యవసాయ చట్టాల అమలులో మౌలిక రంగాల పాత్ర కీలకమైనది. అలాగే ఎగుమతి, దిగుమతి సుంకాల విషయంలో లగ్జరీ వస్తువులపై ట్యాక్సులు పెంచవచ్చు. ఆటోమొబైల్, రిటైల్, ఇతర రంగాలపై పన్నుల విధానంలో మార్పులు చేయకపోవడమే మేలు. విద్యా రంగంలో డిజిటల్, ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణకు కావలసిన మౌలిక వసతులపై కేటాయింపులు ఉండాలి. కరోనా కష్టాల నుంచి గట్టెక్కేందుకు గత ఏడెనిమిది నెలల్లో ప్రభుత్వం ఐదు భారీ ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించింది. రాబోయే కాలంలో ఆ ప్యాకేజీల అమలుకు అవసరమైన నిధులు సమీకరించడం, సంస్కరణలు దృఢచిత్తంతో అమలు చేయాలి. తిరిగి ఆర్థిక పరిస్థితి పట్టాలెక్కాలంటే కరోనా సంక్షోభం నుంచి బయటపడుతున్న ఈ సమయం

ఏకపక్షంగా ఎన్నికల నోటిఫికేషన్

చంద్రబాబు డైరెక్షన్‌లో నిమ్మగడ్డ నిర్ణయాలు

మండిపడ్డ అధికార పార్టీ ఎమ్మెల్యేలు

విజయవాడ,జనవరి23(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులను పట్టించుకోకుండా.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గొల్ల బాబూరావు, ధర్మశ్రీ మీడియాతో మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య రక్షణెళి ప్రభుత్వ బాధ్యత అన్నారు. అందరినీ బెదిరించే ధోరణిలో నిమ్మగడ్డ వ్యవహారశైలి ఉందన్నారు. న్యాయవ్యవస్థపై ప్రభుత్వానికి గౌరవం ఉంది. చంద్రబాబుతో కలిసి నిమ్మగడ్డ కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది.. నిమ్మగడ్డ ఎకపక్షంగా బెదిరించే ధోరణిలో ముందుకెళ్తున్నారని మల్లాది విష్ణు మండి పడ్డారు. నిమ్మగడ్డ ఎక్కడ పనిచేసినా ఉద్యోగులను వేధించడమే పని. ఉద్యోగుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.. ఎన్నికలు నిర్వహిస్తే నిమ్మగడ్డ చరిత్రహీనుడిగా మిగిలిపోతారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హెచ్చరించారు. చంద్రబాబు చేతిలో నిమ్మగడ్డ కీలుబొమ్మగా మారారని ఎమ్మెల్యే ధర్మ శ్రీ విమర్శించారు. ఎన్నికల విషయంలో నిమ్మగడ్డ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు కోసమే నిమ్మగడ్డ రమేష్ కుమార్ పనిచేస్తున్నారని మండి పడ్డారు.

మూడేళ్ల కిందట ఎన్నికల సంఘం నిద్రపోయిందా

చంద్రబాబు హయాంలోనే ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదు

ఆనాడు న్యాయపోరాటం ఎందుకు చేయలేక పోయారు

ఇసి తీరుపై మండిపడ్డ వైకాపా ప్రతినిధి అంబటి రాంబాబు

అమరావతి,జనవరి23(ఆర్ఎన్ఎ): మూడేళ్ల పాటు నిద్రపోయిన ఎన్నికల సంఘం.. మూడు నెలల కోసం ఎందుకు తొందరపడుతోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అంబటి రాంబాబు ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబుకు అనుకూలమైన అధికారులతో.. ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. నిమ్మగడ్డ సమావేశం పొలిటికల్ ప్రెస్‌మీట్‌లా అనిపించిందన్నారు. 2018లో పంచాయతీ ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదో చెప్పాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మూడేళ్లుగా ఈసీ ఎందుకు విఫలమైందన్నారు. .చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు.. ఈ న్యాయపోరాటం ఎక్కడికి పోయిందని నిలదీశారు. ఎన్నికల నిర్వహణ ఒక విధి అనే భావన ఎక్కడా కనిపించట్లేదు. అహంకారంతో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారని అంబటి దుయ్యబట్టారు. తమకు ప్రజలు, ఉద్యోగుల ప్రాణాలు ముఖ్యమని ఆయన తెలిపారు. వ్యాక్సినేషన్, ఎన్నికలు ఒకేసారి నిర్వహించటం సాధ్యం కాదని.. వ్యాక్సినేషన్ చేస్తే కోవిడ్ తగ్గుతుంది. ఎన్నికలు నిర్వహిస్తే కోవిడ్ పెరుగుతుందన్నారు. వ్యాక్సినేషన్ ముఖ్యమా? ఎన్నికలు ముఖ్యమా?. ఎన్నికల్లో ఏకగ్రీవాలు కాకూడదా? అని ప్రశ్నించారు. ఏకగ్రీవాలు జరిగిన చోట స్పెషల్ మోనటరింగ్ పెడతారంట. ఏకాభిప్రాయంతో ఏకగ్రీవాలు జరిగితే అభివృద్ధి సాధ్యమని అంబటి పేర్కొన్నారు.

చంద్రబాబు కనుసన్నల్లో నిమ్మగడ్డ

-వ్యాక్సిన్ ప్రక్రియ నడుస్తుంటే ఎన్నికలా?: ధర్మశ్రీ

విశాఖపట్టణం,జనవరి23(ఆర్ఎన్ఎ): ఎస్ఇసి చంద్రబాబు డైరెక్షన్‌లోనే నిమ్మగడ్డ వ్యవహరిస్తున్నారని విశాఖ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆరోపించారు. కరోనా వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం వ్యాక్సిన్ పక్రియను ఉధృతంగా చేస్తుంటే ఇలాంటి సమయంలో ఎన్నికలు సబబుకాదన్నారు. ఎస్ఈసీ దురుద్దేశ పూర్వకంగా వ్యవహరిస్తు న్నారని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం దారుణ మన్నారు. ఉద్యోగులు ఈ సమయంలో ఎన్నికలంటే ఆందోళనకు గురవుతారని ప్రభుత్వానికి ఉద్యోగులు, ప్రజల ప్రాణాలే ముఖ్యమన్నారు. ఇప్పటికైనా ఎన్నికలు వాయిదా వేయకపోతే నిమ్మగడ్డ రమేష్ కుమార్ చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో పంచాయతీ ఎన్నికలు నిలిపి వేయాలంటూ నర్సీపట్నం వైసీపీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణెశిష్ డిమాండ్ చేశారు. చంద్రబాబు చెప్పినట్టు నిమ్మగడ్డ వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉద్యోగుల బాధలు ఎస్ఈసీ అర్థం చేసుకోవడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు గణెశిష్.

రామతీర్థంలో ప్రతిష్టించే విగ్రహాల తరలింపు

-ఆలయ పునరుద్ధరణకు పూనుకున్నాం: మంత్రి వెల్లంపల్లి

తిరుమల,జనవరి23(ఆర్ఎన్ఎ): రామతీర్థంలో ప్రతిష్టించే విగ్రహాలు తిరుపతి నుంచి శుక్రవారం రోజు రామతీర్థానికి తరలించామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆలయాన్ని పునఃనిర్మించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. మంత్రి శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన కుటుంబసమేతంగా స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో మంత్రి కుటుంబ సభ్యులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని అధికారులు పట్టువస్త్రంతో సత్కరించారు. మంత్రి దర్శనానికి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం అనతంరం మంత్రి వెల్లంపల్లి మీడియాతో మాట్లాడుతూ... నూతన విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ట చేసి, రామ తీర్థం ఆలయ నిర్మాణం చేపడతామని తెలిపారు. పూర్వవైభవం వచ్చేలా ఆలయ నిర్మాణం సంవత్సరాల కాలంలో పూర్తి చేసి, విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని ఆయన స్పష్టం చేశారు.

స్వాతంత్ర్యం సాధించిన తొలి భారత యోధుడు నేతాజీ

రాజన్న సిరిసిల్లా, జనవరి 23 (నేటినిజం ప్రతినిధి):సంపూర్ణ స్వరాజ్యమే ఎజెండాగా పోరాడి స్వాతత్ర్యం ప్రసాదించిన భారత యోధుడు నేతాజీ అని జననీ జన్మభూమిస్టూడెంట్స్ సూసైడ్స్ అండ్ క్రైమ్స్ ఎరాడికేషన్ సొసైటీ (జెజెఎస్)రాజన్న జిల్లా అన్నాడి శేఖర్ అన్నారు.మర్రిగడ్డ గ్రామం లోని జె జె ఎస్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జెజెఎస్ వ్యవస్థాపకుడు రాజన్న జిల్లా అధ్యక్షుడు అల్లాడి చంద్రశేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శి వీరగోని చైతన్య గౌడ్ మాట్లాడుతూ సంపూర్ణ స్వరాజ్యం, సమసమాజ స్థాపన, సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం దుర్మార్గపు బ్రిటీష్ పాలకులతో రాజీలేని సాయుధ ధర్మ పోరాటం చేసిన మహావీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు.

బ్రిటీష్ దుర్మార్గాలకు ,అరాచకాలకు,అన్యాయాలకు,కర్కశ చట్టాలకు అంతం చెప్పాలని అది కేవలం సాయుధ ధర్మ పోరాటం తో సాధ్యమని 1942 ఆగస్టు లో ఆజాద్ హింద్ ఫౌజ్ ని (ఐ .ఎన్. ఏ)స్థాపించిన మహా వీరుడు నేతాజీ అని అన్నారు.శతవిధాల శాంతి మార్గం ఆతర్వాత యుద్ధం అని, జైహింద్ నినాదం తో,రక్తాన్ని ఇవ్వండి నేను స్వాతంత్ర్యం ఇస్తాను అని సింహ స్వరూపుడై దుర్మార్గపు బ్రిటీష్ సామ్రాజ్యం పై యుద్ధం చేసి,బ్రిటీష్ పాలకులను దేశం నలుమూలల నుండి తరిమికొట్టి దేశానికి స్వాతత్ర్యం ప్రసాదించాడని అన్నారు.యువత నేటి అన్యాయాలకు,అరాచకాలకు,అవినీతి కి అంతం చెప్పాలంటే నేతాజీ పోరాట స్ఫూర్తి,ధైర్య సాహసాలు ఆదర్శమని అన్నారు.మన కోసం పోరాడి దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించిన ధర్మ పోరాట యోధుడునేతాజీత్యాగాన్ని,దేశభక్తి స్మరించడం భావితరాలకు చాటడం భారత మట్టిపై ఉన్నభారతీయులందరి కనీస బాధ్యత అని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకపాక దామోదర్, బైరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై తెగేదాకా లాగడం సరైనదేనా

26న ట్రాక్టర్ ప్రదర్శనలతో ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం

ప్రతిష్టంభన కొనసాగడం ఎవరికి లాభం

న్యూఢిల్లీ,జనవరి23(ఆర్ఎన్ఎ): నూతన వ్యవసాయ చట్టాలపై రైతు సంఘాల నేతలు, కేంద్ర ప్రభుత్వం మధ్య శుక్రవారం జరిగిన 11వ దఫా చర్చల్లోనూ ఎలాంటి ఫలితం తేలక పోవడంతో భవిష్యత్ ఏంటన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారన్న చర్చ ఇప్పుడు అందరినీ కలచివేస్తోంది. రెండు పక్షాలూ బెట్టు వీడకపోవటంతో 50 రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు పరిష్కారం లభించలేదు. చట్టాల అమలును ఏడాదిన్నరపాటు వాయిదా వేసేందుకు సిద్ధమని కేంద్రం ప్రతిపాదించగా.. వాటిని పూర్తిగా రద్దుచేయాల్సిందేనని రైతు సంఘాల నేతలు తెగేసి చెప్పారు. ఇదో రకంగా రైతుల మొండి పట్టుగానే భావించాలి. చట్టాలను వాయిదా వేయడమంటే ఓ రకంగా వెనక్కి తగ్గినట్లుగానే గుర్తించాలి.

11వ దఫా చర్చలు ఎడమొహం పెడమొహంలాగా సాగాయి. 5 గంటలపాటు చర్చలు కొనసాగగా.. రైతు సంఘాల నేతలు, కేంద్ర మంత్రులు అరగంటపాటు కూడా ముఖాముఖి చర్చించకపోవటం విశేషం. అంతేకాకుండా మరో దఫా చర్చలకు తేదీని కూడా నిర్ణయించకపోవటంతో ఇకముందు చర్చలు కొనసాగుతాయో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల ఉద్యమంలో బయటి శక్తులు ప్రవేశించినందువల్లనే చర్చలు ఫలించటంలేదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చేసిన ఆరోపణలు గమనార్హం. మూడువ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగుతున్న రైతాంగ ఆందోళన ఇక ముగుస్తుందా లేదా అన్న ఆందోళన కలుగుతోంది. దీనికితోడు 26న ట్రాక్టర్ ర్యాలీ జరిపితీరుతామని ప్రకటించడంతో అసలు ఏం జరుగుతుందో అన్న ఆందోళన కూడా కలుగుతోంది. రైతుల ఆందోళన కారణంగా ఇప్పటికే రాజధాని ఢిల్లీ సహా చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చట్టాలను ఏడాదిన్నర పాటు నిలిపివేసామని కేందప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఉద్యమసంఘాలు తిరస్కరించడంతో రైతులు కూడా మెట్టుదిగేలా కనిపించడం లేదు. చట్టాలరద్దు, మద్దతుధరకు చట్టప్రతిపత్తి వంటి డిమాండ్లకు తాము కట్టుబడి ఉన్నామని రైతుసంఘాల వేదిక సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించింది.

తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ఆందోళన త్వరగా కొలిక్కివచ్చేది కాదని తేలిపోయింది. ఎంతకాలమైనా ఉద్యమాన్ని కొనసాగించాలని రైతుసంఘాలు నిశ్చయించుకున్నా.. అందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా అన్నది కూడా చూడాలి. తాజా పరిణామాలు చూస్తుంటే గణతంత్రదినోత్సవం కారణంగా సమస్యల మరింత జటిలమయ్యేలా ఉంది. ఆ రోజున ఢిల్లీ ఔటర్ రింగ్ రోడ్డులో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించాలని రైతులు భావిస్తున్నారు. గణతంత్రదినోత్సవ కార్యక్రమాల రీత్యా అది భద్రతకు హానికరమని ప్రభుత్వం చెబుతున్నది. ట్రాక్టర్ల పరేడ్‌కు అనుమతించవలసిందిగా రైతు సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఢిల్లీ పోలీసులే ఆ విషయంలో నిర్ణయం తీసుకుంటారని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే తేల్చి చెప్పింది. ఎట్టి పరిస్థితులలోను ట్రాక్టర్ ర్యాలీకి అనుమతించేది లేదని ప్రభుత్వం కూడా స్పష్టం చేసింది. ర్యాలీ యథావిధిగా జరుగుతుందా, జరిగితే ఏం జరుగుతుందన్న ప్రశ్న ఉదయిస్తోంది. కేందప్రభుత్వంతో జరుగుతున్న చర్చలలో నలభైకి పైగా రైతునంఘాలు పాలుపంచుకుంటున్నాయి. ఈ సంఘాలలో కొన్ని ప్రభుత్వ సానుకూల స్పందనకు సంతోషంగా ఉన్నాయని చెబుతున్నారు. మరి కొందరు నిలుపుదల కాలాన్ని ఏడాదిన్నర నుంచి రెండేళ్లకు, అంతకు మించి పెంచమని డిమాండ్ చేయాలని భావిస్తున్నారు. ఇదంతా రైతు ఉద్యమాన్ని భగ్నం చేసేందుకు చెబుతున్న మాటలే తప్ప, ప్రభుత్వం మాట మీద నిలబడదని, చట్టాలను పూర్తిగా రద్దుచేయడం ఒక్కటే ఆమోదనీయమని మరి కొందరు వాదిస్తున్నారు. ఇకపోతే చట్టాల అమలును నిలిపివేశాము కదా, వాటి చట్టబద్ధతను నిర్ణయించేవరకు మీరు ఆందోళనను నిలిపివేయవచ్చును కదా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. సాంకేతికంగా రాజ్యాంగ బద్ధమైన చట్టాలను కూడా వ్యతిరేకించే హక్కు ప్రజలకు ఉన్నదని సుప్రీంకోర్టు భావించింది. ఇప్పటిదాకా కనీస మద్దతుధరకు చట్టబద్ధత కానీ, చట్టబద్ధత ఇవ్వాలన్న బలమైన డిమాండ్ కానీ లేదు. ఇప్పుడు, ఆ అంశాలను పరిశీలించడానికి కేంద్రం అంగీకరించడమంటే, ఇది రైతుల విజయమే.

కాంగ్రెస్‌కు కలసి వచ్చిన పిసిసి చీఫ్ ఎంపిక వాయిదా

సాగర్ ఉప ఎన్నిక వరకు కలసి నడిచే యోచనలో నేతలు

ఆ తరవాతే జంప్ జిలానీల సంగతి తెలిసేది

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): నాగార్జున సాగర్ ఉప ఎన్నిక బూచితో ఆగిన పిసిసి అధ్యక్షుడి ఎన్నిక కారణంగా కాంగ్రెస్‌లో ఇప్పుడు ఐక్యత కనిపిస్తోంది. పార్టీలోంచి వెళ్లదలచుకున్న వారు సైతం ఆగిపోయారు. దీంతో తాజాగా ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారించారు. మొత్తంగా ఇప్పుడు అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. అధికార పార్టీపై చేస్తున్న పోరాటాలు కలసి రావడం లేదు. కాంగ్రెస్‌లో ఉండి చేసే విమర్శలను ప్రజలు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పటికే అనేకమంది పార్టీని వీడి బిజెపి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. పిసిసి చీఫ్‌ను ప్రకటించాక కొందరు తమదారి తాము చూసుకుంటారన్న ప్రచారం సాగింది. ఈ క్రమంలో ప్రజల్లో మళ్లీ దూసుకుని పోయేందుకు ఇటీవల రైతుల సమస్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. కేంద్రం తెచ్చిన చట్టాలను వ్యతిరేకిస్తూనే.. రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల ఎత్తివేతను నిరసిస్తూ నాయకులు ఉద్యమిస్తున్నారు. రైతులకు అండగా మేమున్నాం అని చెప్పే ప్రయత్నంలో భాగంగా వివిధ రకాల ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. పిసిసి చీఫ్ ఉత్తమ్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సహా తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన నాయకులు హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ఒకరోజు దీక్ష చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు బృందంగా నిరసన చేపట్టాలని అనుకున్నారు. చాలా రోజుల తర్వాత చేపట్టిన ఉద్యమం కావడంతో పార్టీ నేతలంతా హుషారుగా వచ్చినా.. ఎమ్మెల్యేలు సీతక్క, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రం హాజరు కాలేదు. పార్టీ దీక్షకు జనాల్లో వచ్చిన ప్రచారం ఒక ఎత్తు అయితే.. ఈ ముగ్గురి గైర్హాజరుపై కాంగ్రెస్‌లో జరుగుతోన్న చర్చ మరో ఎత్తు.

సీఎల్పీ నేత తనను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే సీతక్క బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. ఇద్దరికీ మొదటి నుంచి పడటం లేదని చెబుతారు. అసెంబ్లీ సమావేశాల్లో అంతా కలిసే ఉంటారు కానీ.. ఆమె ఎంపీ రేవంత్‌రెడ్డి వర్గానికి చెందిన మనిషిగా ముద్ర ఉంది. టిడిపి నుంచి ఆమె రావడం కూడా రేవంత్ ద్వారానే వచ్చింది. ఆయన వర్గానికి చెందిన మనిషినే అయినా ఎమ్మెల్యేగా తన అభిప్రాయానికి విలువ ఇవ్వాలని కాదా అని ఆమె ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ తన అభిప్రాయం నచ్చకపోతే దూరం పెట్టినా బాగుండేదని కుండబద్దలు కొట్టేస్తున్నారు. ఇప్పుడు దీక్షకు రాకపోవడానికి కారణం కూడా అదేనని అనుకుంటున్నారు.

ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి.. సీఎల్పీ నేత భట్టివిక్రమార్కకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యవహారామే కొంత సందిగ్ధంలో ఉంది. బిజెపిలో చేరుతానంటూనే వేచిచూసే ధోరణిలో ఉన్నారు. ఈ మధ్యే బీజేపీలోకి వెళ్తానని మరోమారు చెప్పేశారు. అందుకే కాంగ్రెస్ చేపట్టిన దీక్షకు రాలేదని అనుకుంటున్నారు. నిరసన కార్యక్రమానికి వచ్చి బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఇబ్బంది అనుకున్నారో ఏమో ఎవరికీ అందుబాటులో లేకుండా కామైపోయారు. అయితే ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి దీక్షకు ఎందుకు రాలేదన్నది ప్రశ్న. పీసీసీ కొత్త చీఫ్ ఎంపిక విషయంలో ఆయన అసంతృప్తితో ఉన్నారా? అందువల్లే రాలేదా అన్నది కూడా చర్చ జరుగుతోంది. ఇప్పటికైతే పీసీసీ చీఫ్ ఎంపిక పక్రియ ఆగిపోవడంతో కొందరు బిజెపిలోకి పోదామనుకున్నా వెనక్కి తగ్గారు. సాగర్ ఉప ఎన్నిక ఫలితం తరవాత ఎలా ఉంటుందన్నది కూడా ఆలోచన చేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ మాత్రం ఎప్పటికీ కప్పల తక్కెడగానే ఉంటుంది. ఎప్పుడు దుంకుతారో ..ఎప్పుడు కలసికట్టుగా ఉంటారో తెలియదు.

ఎపిలో మోగిన పంచాయితీ ఎన్నికల నగారా

తొలిదశ పోలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల

25వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరణ

27వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ

28న నామినేషన్ల పరిశీలన, 29న అభ్యంతరాల పరిశీలన

30న అభ్యంతరాలపై తుది నిర్ణయం

31న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ

ఫిబ్రవరి 5న ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 3.30వరకు పోలింగ్

అదేరోజు సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నిక

విజయవాడ,జనవరి23(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్... ఈ మేరకు నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం నుంచి మొదటి దశ ఎన్నికల పక్రియ ప్రారంభం కాగా... ఫిబ్రవరి 5వ తేదీన సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికతో ముగియనుంది.. ఇక, ఎన్నికల నోటిఫికేషన్‌ను పరిశీలిస్తే... తొలి విడతకు జనవరి 25వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు.. 27వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా.. 28న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్లపై వచ్చిన అభ్యంతరాల పరిశీలన, 30న అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు.. ఇక, 31న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా నిర్ణయించారు. ఫిబ్రవరి 5వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్ సాగనుండగా.. అదే రోజు 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాల వెల్లడించనున్నారు.. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేయనున్నట్టు ఎస్ఈసీ వెల్లడించింది. రాష్ట్రంలో తొలి దశ పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం ఉదయం విడుదలైంది. హైకోర్టు ఆదేశాలతోనే ఎన్నికలు నిర్వహిస్తు న్నామని ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల నిర్వహణ కమిషన్ విధి అని స్పష్టం చేశారు. సుప్రీం తీర్పును తక్షణం పాటిస్తామని తెలిపారు. హైకోర్టు తీర్పు సహేతుకమే అని... ఎస్ఈసీ వాదనను హైకోర్టు విశ్వసించిందని తెలిపారు. ఎస్ఈసీకి న్యాయవ్యవస్థపై విశ్వాసం, విధేయత ఉంటాయని చెప్పారు. కరోనా వ్యాక్సినేషన్ చేపడుతూనే విజయనగరం, ప్రకాశం మినహా మిగిలిన జిల్లాల్లో తొలి విడత ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలింగ్ సమయాన్ని సాయంత్రం నాలుగు గంటల వరకు పొడిగించామన్నారు. సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని... సీఎస్, డీజీపీలు సహా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొనాలని నిమ్మగడ్డ కోరారు. పంచాయితీ రాజ్ కమిషనర్ మరింత మెరుగ్గా వ్యవహరించాల్సి ఉందన్నారు. పంచాయితీ రాజ్ కమిషనర్ పూర్తిగా విఫలమవ్వడం చాలా బాధాకరవనని తెలిపారు. 2019 ఓటర్ల జాబితా ప్రకారమే నిర్వహిస్తున్నామని అన్నారు. విధి లేని పరిస్థితుల్లో మాత్రమే 2019 ఓటర్ల జాబితాతో ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో పీఆర్ కమిషనర్ అలక్ష్యంతో ఉన్నారని విమర్శించారు. పీఆర్ కమిషనర్‌పై సరైన సమయంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ సూచనలు సహేతుకంగా లేవన్నారు. ఎన్నికలను వాయిదా వేయాలన్న ప్రభుత్వ సూచనను తిరస్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తీరు కూడా సరిగా లేదని వ్యాఖ్యానించారు. సీఎస్ తనకు రాసిన లేఖ తనకంటే ముందుగానే మీడియాకు చేరిందన్నారు. ఆర్టీఐ నుంచి మినహాయింపులున్నా కమిషన్ విషయంలో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాల్లో గోప్యత పాటించాల్సి ఉంటుందని నిమ్మగడ్డ రమేష్‌కుమార్ చెప్పుకొచ్చారు. ఏకగ్రీవ ఎన్నికపై కమిషన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఐజీ స్థాయి అధికారితో పర్యవేక్షణ ఉంటుందన్నారు. కలెక్టర్లకున్న తరహాలోనే ఎస్ఈసీకి నిధుల విషయంలో సమస్యలు ఉన్నాయని చెప్పారు. నిధుల విషయంలో ప్రభుత్వ తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కమిషన్ కోరినప్పుడు నిధులు.. సిబ్బందిని సమకూర్చే బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, జేడీ ఇలా ఎవ్వరూ లేరని.. అయినా ఎన్నికలు జరిపి తీరుతామని తేల్చిచెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ తమకు పెను సవాల్ అని ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పేర్కొన్నారు.

చనిపోయిన రైతు కుటుంబాలకు బాసట

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం..5లక్షల పరిహారం

పంజాబ్ సిఎం అమరేందర్ సంచలన నిర్ణయం

ఛండీగఢ్,జనవరి23(ఆర్ఎన్ఎ): పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ శనివారం భారీ ప్రకటన చేశారు. రైతు ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు పంజాబ్ ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. రైతు ఉద్యమంలో ఇప్పటివరకు దాదాపు 76 మంది చనిపోయారు. తన ఫేస్‌బుక్ లైవ్ ప్రోగ్రాం 'ఆస్క్ ది కెప్టెన్'లో ఈమేరకు కెప్టెన్ ఈ ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ రైతులు దేశ రాజధాని ఢిల్లీ శివారులో నెల రోజులకు పైగా ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం 2020 సెప్టెంబర్‌లో ఈ మూడు చట్టాలను రూపొందించింది. ఈ చట్టాలు మధ్యవర్తుల పాత్రను తొలగిస్తాంచి, రైతులు తమ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా విక్రయించడానికి అనుమతిస్తాయి. అయితే, ఈ మూడు వ్యవసాయ చట్టాలు రైతు వ్యతిరేకిగా ఉన్నాయంటూ పేర్కొంటున్న రైతులు వాటిని రద్దు చేయాలంటూ ఆందోళనకు దిగారు. పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చేలా ఈ చట్టాలను రూపొందించారని, వీటిని రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. రైతు ఉద్యమంలో పాల్గొన్న పలువురు ఈ చట్టాలతో నష్టపోవాల్సి వస్తుందని ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 76 మంది చనిపోయినట్లు తెలుస్తున్నది. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ముందకొచ్చారు. వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి

-కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్

అనంతపురం,జనవరి23(ఆర్ఎన్ఎ): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నేతలు సత్తా చూపాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు పార్టీ కార్యకర్

పర్యాటకంతోనే దేశ సుస్థిర ప్రగతి

భారత ఆర్థికాభివృద్ధిలో పర్యాటకరంగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేశ జిడిపికి పర్యాటకరంగం 6 శాతం కన్న ఎక్కువ దోహదపడుతుందని తేలింది. దేశ వైవిధ్య భరిత వారసత్వ సంపద పునాదిగా పర్యాటక పరిశ్రమ వృద్ధి చెందుతుంది. పర్యాటకాభివృద్ధి ఫలితంగా వారసత్వ కట్టడాల నిర్వహణ, స్వచ్ఛత, ఆధునిక వసతుల కల్పన, పర్యాటక స్థలాల నిర్వహణ, రైల్వే స్టేషన్లు మరియు ఎయిర్ పోర్టుల నిర్వహణ, శాంతి భద్రతల స్థాపన వంటి వాంఛనీయ చర్యలు తీసుకోబడతాయి. పర్యాటకరంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమని నమ్మిన ప్రభుత్వాలు దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షించే చర్యలను తీసుకోవడం జరుగుతున్నది. దేశ పర్యాటకాన్ని ప్రోత్సహించడం, పర్యాటకరంగం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం మరియు పర్యాటకరంగంతో ఆర్థికాభివృద్ధి లాంటి లక్ష్యాలతో ప్రతియేటా 25 జనవరి రోజున 'జాతీయ పర్యాటక దినం' ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. 27 సెప్టెంబర్ రోజున 'ప్రపంచ పర్యాటక దినం' కూడా నిర్వహించుట జరుగుతున్నది. భిన్నత్వంలో ఏకత్వం నినాదాన్ని నమ్మిన భారతదేశానికి విదేశీ పర్యాటకుల రాక రోజు రోజుకు పెరుగుతోంది. ఇజ్రాయిల్, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల పర్యాటకులు భారతదేశ చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ, ప్రకృతి, సముద్రయాన, విద్య, వ్యాపార, క్రీడ, గ్రామీణ, వైద్య, పర్యావరణ మరియు ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆకర్షితులవుతూ అధిక సంఖ్యలో రావడం జరుగుతున్నది.

పాశ్చాత్య దేశాలకు భారత్ చక్కటి పర్యాటక కేంద్రంగా నిలుస్తున్నది. ఆగ్రాలోని తాజ్‌మహాల్, హైదరాబాద్‌లోని చార్మినార్, ఆంధ్రలోని తిరుపతి, ఢిల్లీలోని కుతుబ్‌మినార్, సంచి స్తూపా, కేదారినాథ్ మరియు గోవా బీచ్‌లు లాంటి అనేక ఆకర్షణీయ కేంద్రాలు విదేశీ పర్యాటకుల మనసులు దోచుకుంటున్నాయి. భారత పర్యాటకరంగంలో 40 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడుతున్నాయి. దేశంలో 7.7 శాతం ఉద్యోగాలు పర్యాటక పరిశ్రమలో పని చేస్తున్నారు. 2023 నాటికి పర్యాటకం 7.9 శాతం వృద్ధి అవుతుందని అంచనా వేస్తున్నారు. కుంభమేళ లాంటి జాతీయ ఉత్సవాల్లో దాదాపు 75 మిలియన్లకు పైగా భక్తులు హాజరు అవుతున్నారు. భారతదేశానికి అమెరికా, బంగ్లాదేశ్ మరియు యూకెల నుండి అధిక పర్యాటకులు వస్తున్నారు. 2020లో దాదాపు 1.41 మిలియన్ల పర్యాటకులు భారత్‌ను దర్శించారని తేలింది. పర్యాటక పరిశ్రమతో సత్వర దేశ ఆర్థిక ప్రగతి, సుస్థిరాభివృద్ధి, సామాజిక వికాసం మరియు పేదరిక నిర్మూలన సాధ్యం అవుతున్నది. పర్యాటకంతో ప్రయాణాలు, హోటల్ వసతులు, వ్యాపారాలు, దేశ ప్రతిష్టలు పెరుగుతాయని గమనించాలి. కేంద్ర, రాష్ట్ర మరియు సంబంధిత సంస్థలు సమన్వయంతో సాగితే దేశ పర్యాటకరంగం విస్తరించబడుతుందని తెలుసుకోవాలి. 2018లో పర్యాటక పరిశ్రమ ద్వారా 247.3 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగిందని, దేశ జిడిపిలో ఇది 9.2 శాతమని గమనించాలి. సుందర భారతదేశంలో ప్రత్యేక వైవిధ్యత, ప్రఖ్యాత చరిత్ర మరియు సాంస్కృతిక విలక్షణతలు పర్యాటక పరిశ్రమకు ఊపిరి పోస్తున్నాయి.

(25 జనవరి 'జాతీయ పర్యాటక దినం' సందర్భంగా)

భారత్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో కేరళ ప్రకృత అందాల విందులు, బీచ్‌లు, బ్యాక్ వాటర్స్, హరిత తివాచీలు, టీ తోటలు సమ్మిళితమైనందున దానిని 'దేవతల దేశం (గాడ్స్ ఓన్ కంట్రీ)'గా పిలుస్తుంటారు. గుజరాత్‌లో గాంధీ అడుగుజాడలు, బీచ్‌లు, మ్యూజియమ్స్, జాతీయ పార్కులు అనేకం పర్యాటకులకు కన్నుల విందు చేస్తాయి. మధ్యప్రదేశ్‌లో ఖజురాహో అందాలు, కన్హా లాంటి జాతీయ పార్కులు ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలలో జానపద నాట్యాలు, ప్రత్యేక జీవనశైలి మరియు వస్త్రాలంకరణలు, ప్రకృతి రమణీయతలు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారత్‌లో 38 ప్రపంచ వారసత్వ కేంద్రాలు గుర్తించబడినవి. 2019లో పర్యాటక సూచికలో భారతదేశం 34వ ర్యాంక్‌లో ఉన్నది. భారతదేశాన్ని సందర్శించడానికి 168 దేశాల పర్యాటకులకు సులభంగా ఈ-టూరిస్ట్ వీసాలు అందుబాటులో ఉన్నాయి. మన దేశంలో 28 అంతర్జాతీయ విమానాశ్రయాలు విదేశీ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నాయి.

తెలంగాణలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, కుతుబ్‌షాహీ టోంబ్స్, భువనగిరి కోట, వరంగల్ వేయిస్తంభాల గుడి మరియు ఏకశిలానగరం, రామప్ప శిల్పసంపద, జోగులాంబ గుడి, యాదగిరి క్షేత్రం, చార్మినార్, నాగార్జున సాగర్, బొగత మరియు కుంతాల వాటర్ ఫాల్స్, లక్నవరం, ఫలక్‌నుమా ప్యాలెస్, గోల్కొండ కోట, చౌమల్లా ప్యాలెస్, రామోజీ ఫిలిం సిటీ, భద్రాద్రి రామాలయం, వేములవాడ రాజన్న, బాసర సరస్వతి, మక్కా మసీదు, మెదక్ చర్చ్ లాంటి పర్యాటక ప్రదేశాలు అనేకం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి వెంకన్న, విశాఖ బీచ్‌లు, శ్రీశైలం, శ్రీకాళహస్తి, అరకు, బుర్రా గుహలు, విజయవాడ కనకదుర్గ గుడి, హార్సిలీ హిల్స్, పాపికొండలు, కోనసీమ అందాలు, వన్యప్రాణి , సింహాచలం, పుట్టపర్తి, అన్నవరం, మంత్రాలయం, నాగార్జున కొండ లాంటి పర్యాటక కేంద్రాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశ పరువు ప్రతిష్టలను ఇనుమడింపచేస్తూనే, ప్రపంచ దేశాల్లో భారతీయతను నిలబెట్టుకోవడానికీ, ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భాగస్వామ్యం తీసుకోవడానికి పర్యాటక పరిశ్రమను అభివృద్ధి చేయడం మనందరి స్వీయ కర్తవ్యంగా భావించాలి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

వ్యవసాయంపై ఏటా రూ.35 వేల కోట్లు వెచ్చిస్తున్న తెలంగాణ

రైతులను సంఘటితం చేయాలన్నదే సిఎం కెసిఆర్ ఆకాంక్ష

నందిగామలో రైతువేదిక, షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీష్

సంగారెడ్డి,జనవరి23 (నేటినిజం ప్రతినిధి):: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంపై ఏటా రూ.35 వేల కోట్లు వెచ్చిస్తున్నదని, దేశంలో ఇంత ఖర్చు చేస్తున్న రాష్ట్రం

తెలంగాణ మాత్రమేనని మంత్రి హరీశ్ రావు అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏండ్లు దాటినా రైతుల పరిస్థితి మారలేదన్నారు. అందరికీ సంఘాలు ఉన్నప్పటికీ రైతులకు మాత్రం లేవని చెప్పారు. రైతులను సంఘటితం చేయాలన్నదే సీఎం ఆకాంక్ష అని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలం నందిగామలో రైతువేదిక, షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ తోటలను పెంచి రైతులు అధిక లాభాలు ఆర్జించాలని ఆర్థిక శాఖా మంత్రి హరీష్‌రావు అన్నారు. నందిగామలో నిర్మించిన రైతు వేదికను జిల్లాలోనే చాలా అద్భుతంగా కట్టారని ఆయన కొనియాడారు. రైతులకు మంచి భవిష్యత్తు ఉండాలనే సీఎం కేసీఆర్ ఈ రైతు వేదికలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో నిర్మించాలని ఆదేశించారన్నారు. ఈ రైతు వేదికలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత పాలకులు ఏనాడూ రైతులను పట్టించుకోలేదన్నారు. దీంతో వ్యవసాయం దెబ్బతిందని, రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని హరీష్‌రావు పేర్కొన్నారు. రైతుల పెట్టుబడి కోసం రైతుబంధును అందిస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతుబంధుతో వేల కోట్ల రూపాయలను రైతులకు సీఎం అందిస్తూ వారిని ఆదుకోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం లేదన్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికే రైతుబంధు సమితులను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. రైతు వేదికను ఎంత ఉపయోగించుకుంటే అంత మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ వేదికలో నిరంతరం చర్చా కార్యక్రమాలు జరుగాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు పామాయిల్ తోటలను పెంచుకోవాలని కోరారు. దీనికి అధికారులు సహకారం అందించాలన్నారు. పామాయిల్ పెంపకంతో అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ తోటల పెంపకానికి ఎక్కువ పెట్టుబడి కూడా అవసరం లేదన్నారు. ఈ ప్రాంతం హైదరాబాద్‌కు దగ్గరగా ఉందని, రైతులు కూరగాయలు, పూలు, తదితర వాణిజ్య పంటల వైపు దృష్ట సారించాలని మంత్రి హరీష్‌రావు సూచించారు. పెట్టుబడి తగ్గించుకోవడానికి సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. వ్యవసాయంలో మూస పద్ధతులను వదిలి కొత్త పద్ధతులను అవలంభించాలన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో అల్లం,ఆలు గడ్డలు పండించి రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోరినట్లు అమీన్ పూర్ లో మంచి రైతు వేదికను కట్టిస్తామని మంత్రి హరీష్‌రావు హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు రైతుల గురించి మాట్లాడుతారని, అనంతరం పట్టించుకోరని విమర్శించారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో పూర్తిగా మార్పు వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లోనే కరెంటు సమస్యను పరిష్కరించామని చెప్పారు. ప్రాజెక్టులు నిర్మించడంతో ఇప్పుడు కరెంటు ఉన్నా లేకున్నా రెండు పంటలు పండించే పరిస్థితి వచ్చిందని వెల్లడించారు. సీఎం కేసీఆర్ తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని చెప్పారు. అనంతరం పఠాన్‌చెరు టౌన్‌లో గాంధీ థీమ్ పార్కుకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.1.6 కోట్లతో పార్కును నిర్మిస్తున్నామని చెప్పారు. కార్పోరేషన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు తొలి అడుగు వేశామన్నారు. ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ స్థాయి దవాఖానను నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, రైతుబంధు సమతి నాయకులు, టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్‌ను కలిసిన నీతి ఆయోగ్ బృందం

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్‌కుమార్, అడ్వయిజర్ రవీంద్ర ప్రతాప్‌సింగ్, కన్‌స్టలెంట్ డాక్టర్ నమ్రత సింగ్‌పన్వార్, రీసెర్చి ఆఫీసర్ కామరాజుతో కూడిన బృందం శుక్రవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావును కలుసుకున్నారు. పలు అంశాలపై వారు చర్చించారు. ఈ చర్చల్లో ఆర్ అండ్ బి శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తదిరులు పాల్గొన్నారు.

స్టాఫ్ ఎలక్షన్ కోడ్ లో ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించిన మధుకర్ కు అభినందనలు

రాజన్న సిరిసిల్లా, జనవరి 23 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ రూరల్ మండలం చెక్క పల్లి గ్రామానికి చెందిన మెతుకు నారాయణ లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడైన మెతుకు మధుకర్ ఈ నెల 21 తేదీన విడుదల చేసిన స్టాఫ్ సెలక్షన్ కోడ్ పరీక్ష ఫలితాల్లో లో (ఎస్, ఎస్ , సి) ఉద్యోగం పొందిన మధుకర్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి తాండ్రలతిరుపతి అభినందించిరు. . ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ దేశానికి సేవచేసే అవకాశం అందరికి రాదు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనేక ఉన్నత పదవులు చేపట్టాలని కొనియాడారు. దీంతోపాటు దేశానికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన మధుకర్ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలోకార్యక్రమంలో చెక్క పెల్లి గ్రామ ఉపసర్పంచ్ తలారి మంజుల సురేష్, బట్టు అంజిబాబు, బుర్ర లింగేష్ గౌడ్, ఇదే కుటుంబం నుంచి ఏ ఆర్ ఏఎస్ఐ హైదరాబాదులో గండి గండిపేటలో సేవలందిస్తున్న మెతుకు మల్లేశం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

5016/- రూపాయల నిధి సమర్పించిన 24 వ వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమారాణి శ్రీనివాస్

రాజన్న సిరిసిల్లా, జనవరి 23 (నేటినిజం ప్రతినిధి):అయోధ్య రామమందిర్ నిధి సమర్పణ ఇంటింటి జనజగరణ ఉద్యమం లో భాగంగా వేములవాడ పట్టణం లోని 24 వ వార్డు లో గడప గడపకు నిధి సమర్పణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది , వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమారాణి శ్రీనివాస్ గారు తమ వంతుగా 5016/- రూపాయలను అందజేయడం జరిగింది , వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వారి శక్తి కొలది నిధి సమర్పించాలని కోరారు ఇట్టి అవకాశం రావడం అదృష్టం అని తెలిపారు కార్యక్రమంలో గడప కిషోర్ రావు , తదిగొప్పుల రవి ,విశాల్ కుమార్ , వార్డు ప్రజలు శ్రీధర్ ,అశోక్ , అరుణ్ , శ్రీకాంత్, హరీష్ రాజు తదితరులు పాల్గొన్నారు

కోవిడ్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించనున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి23(ఆర్ఎన్ఎ): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి శనివారం హైదరాబాద్ కవాడి గూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం లో, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి), రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో (ఆర్ఒబి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొవిడ్ వ్యాక్సిన్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తెలంగాణలో ఎంపిక చేసిన 8 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, వరంగల్ అర్బన్, కరీంనగర్ లలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు మొబైల్ వ్యాన్ల ద్వారా కరోనా వ్యాప్తి నివారణ, కరోనా టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. పబ్లిసిటీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కేంద్ర మంత్రి ప్రారంభిస్తారు.ఆ తరువాత విలేకరుల సమావేశంలో పాల్గొంటారు.

నిర్మాణ రంగాల్లో ఇసుక ప్రధాన పాత్ర

ఇసుకకు కొరత లేదన్న మంత్రి శ్రీనివాస గౌడ్

మహబూబ్‌నగర్,జనవరి23 (ఆర్ఎన్ఎ): ప్రస్తుతం ఇసుక కొరత లేదని, అన్ని రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు చేరడంతో ఇసుక అందుబాటులో ఉందని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక ఉప కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణ రంగాల్లో ఇసుక ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. దళారుల రంగప్రవేశం, బ్లాక్ చేయడంతో ఇసుకకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని, ప్రభుత్వ పనులతోపాటు ప్రైవేటు వ్యక్తులకు అందడం కష్టంగా మారిందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సామాన్యులకు తక్కువ ధరకు ఇసుకను అందించేందుకే ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అవసరమైన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే టిప్పర్ ద్వారా నేరుగా ఇంటికి వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒక టన్నుకు రూ.900 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, డీసీసీబీ ఉపాధ్యక్షుడు కొరమోని వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అడవిపందులను చంపిన నిందితుల అరెస్ట్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి23 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని అశ్వాపురం మండలం అచ్యుతాపురం గ్రామ సమీపం లోని జీడి మామిడి తోటలో ఉచ్చులు పెట్టి అడవి పందిని చంపిన నిందితులను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దమ్మపేట మండలం నారా వారి గూడెంకు చెందిన గురివింద బుచ్చిరాజు, నాగరాజు, సత్తయ్య, రాజు అనే వ్యక్తులు పందిని చంపినట్లు గుర్తించారు. ఫారెస్ట్ అధికారి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పశువైద్యాధికారి సమక్షంలో చనిపోయిన పందిని ఖననం చేశారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా

నేతాజి సుభాష్‌చంద్రబోస్ జయంతి(పరాక్రమ దివస్) వేడుకలు

కరీంనగర్. జనవరి 23 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌వ్యాప్తంగా శనివారం నాడు నేతాజి సుభాష్‌చంద్రబోస్ 125వ జయంతి(పరాక్రమ దివస్)వేడుకలు జరిగాయి. కమిషనరేట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన అత్యంత సాహసపోతమైన చర్యలు, బ్రిటిష్‌వారిని గడగడలాడించేందుకు ఇతర దేశాలతో కలిసి ప్రత్యేకంగా ఆజాద్‌హిందూఫౌజ్‌అనే వ్యవస్థను ఏర్పాటు చేయడం చరిత్రలో ఒక మరిచిపోలేని ఘట్టంగా చెప్పుకోవచ్చన్నారు. స్వాతత్ర్య సమరంలో ఆయన ధైర్యసాహసాలు, విభిన్నతరహా పోరాటాలు, ఆయన జీవిత చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించడానికి అర్హులని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఈ జనవరి 23న నేతాజి జయంతిని పరాక్రమ దివస్‌గా కేంద్రం ప్రభుత్వం జరుపనున్నదని వివరించారు. ఆయన దుర్మరణం ఒక విషాద సంఘటనగా అభివర్ణించారు.

కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లు, సర్కిల్, డివిజన్‌స్థాయి కార్యాలయాల్లో ఈ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ) ఎస్ శ్రీనివాస్, జి చంద్రమోహన్(పరిపాలన), సిపివో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉమేష్‌కుమార్, ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్, నటేష్, ఆర్ఐలు మల్లేశం, జానీమియా, శేఖర్, కిరణ్‌కుమార్, మురళీలతోపాటు పలువురు పోలీసు అధికారులు, మినిస్టీరియల్ విభాగానికి చెందిన అన్నిస్థాయిలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ నేతల వ్యవహరిస్తున్న నిమ్మగడ్డ

-అధికారాలతో పాటు బాధ్యతలూ తెలుసుకోవాలి: బొత్స

నెల్లూరు,జనవరి23(ఆర్ఎన్ఎ): ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు అధికారం తప్ప.. బాధ్యతల గురించి పట్టించుకోవడం లేదని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం ఆయన నెల్లూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎస్ఈసీకి అధికారంతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని.. అధికారాన్ని, బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు వ్యాక్సిన్ తప్పనిసరని ప్రధాని చెప్పారు. ప్రజారోగ్యం ప్రభుత్వానికి ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఓ రాజకీయ నేతలా నిమ్మగడ్డ వ్యవహరిస్తున్నారని.. వ్యక్తిగత అవసరాల కోసమే ఆయన పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ప్రభుత్వం చెబితే పట్టించుకోవడం లేదు.. రేపు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరిదని మంత్రి బొత్స ప్రశ్నించారు. నిమ్మగడ్డ రమేష్ వ్యక్తిగత స్వార్థం, పరిచయాల కోసం రాజ్యాంగాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఎవరి కోసం ఈ ఎన్నికలు. గతంలో మేము ఎన్నికలు నిర్వహించమంటే ఎందుకు పెట్టలేదు. చంద్రబాబు మీ స్నేహితుడని, సామాజిక వర్గమని ఎన్నికలు పెట్టలేదా.. ఇప్పుడు ఈ ఎన్నికలు మీకు పదవిచ్చిన చంద్రబాబు మెప్పు పొందడానికా..? చంద్రబాబుతో నిమ్మగడ్డ రమేష్ లాలూచి పడ్డారు. ఎన్నికలు మూడు నెలల వాయిదా వేయడం వల్ల ఏలాంటి నష్టం లేదు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేయడం ఎంత వరకు కరెక్టు. రాజ్యాంగ వ్యవస్థలో నిమ్మగడ్డ వంటి వ్యక్తులు ఉండటం చాలా దురదృష్టం అని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుంది. రాష్ట్రంలో ప్రతి విషయానికి చంద్రబాబు అల్లకల్లోలం సృష్టిస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ నిప్పులు చెరిగారు.

అల్విదా డాక్టర్ సాబ్

-సంఘ సేవకుడు.. హక్కుల పరి రక్షకుడు డాక్టర్ బషీర్ అహ్మద్ కన్నుమూత

-జమతే ఇస్లామీ హింద్ వేదికగా సమాజ సేవ

-పలు పార్టీల నేతలు..సామాజిక కార్యకర్తల సంతాపం



కరీంనగర్. జనవరి 23 (నేటినిజం ప్రతినిధి):జమతే ఇస్లామీ హింద్ క్రియాశీలక కార్యకర్త..ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ మహమ్మద్ బషీర్ అహ్మద్ (85) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. శనివారం జాఫ్రీ మస్జిద్ లో జుహార్ నమాజ్ అనంతరం నమాజ్ జనాజా అనంతరం సవారన్ ఖబ్రస్థాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి జీసీబఎం పట్టా పొంది ప్రభుత్వ వైద్యుడిగా జీవితం ప్రారంభించిన ఆయన జిల్లా స్థాయి అధికారిగా రిటైర్మెంట్ అయ్యారు. జమాతే ఇస్లామీ హింద్ వేదికగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనేక రకాలుగా పేదలకు అండగా నిలిచారు. బీదల పక్షపాతిగా..పీడిత ప్రజల హక్కుల కోసం గొంతెత్తారు. మహమ్మద్ ప్రవక్త యావత్తు మానవాళి కోసం పుట్టించబడ్డారని, హిందూ-ముస్లిం సోదర భావంతో మెదళాలని ఎలుగెత్తి చాటారు. ఇస్లాం ను కుల మతాలకు అతీతంగా పరిచయం చేయడానికి మలి సంధ్యలోను పరితపించారు. వేలాది పుస్తకాలను తన స్వంత ఖర్చుతో కొని గ్రామీణ ప్రాంతాల్లోని, పట్టణ ప్రాంతాల్లో జాతి, వర్గం తేడా లేకుండా ఉచితంగా పంచారు. జమతే ఇస్లామీ హింద్ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో డాక్టర్ బషీర్ అహ్మద్ సాయం అందించే వారంటే అతియోశక్తి కాదు. ఎన్నో సేవా కార్యక్రమాలు నేటికి ఆయన సామాజిక పటిమకు అద్దం పడుతాయి. డాక్టర్ సాబ్ తుది శ్వాస విడిచి ఈ లోకం నుండి దూరమైన ఆయన సేవలు.. మాటలు. .కఠినత్వం.. పోరాట పటిమ మాత్రం సజీవంగా ఉంటాయి. ఆయనకు 4గురు కుమార్తెలు, 6గురు కుమారులు ఉన్నారు. డాక్టర్ సాబ్ కుమారుడు మహమ్మద్ నిసార్ అహ్మద్ సీనియర్ ఉర్దూ రిపోర్టర్ గా నగరంలో సుపరిచితుడు. డాక్టర్ సాబ్ అకాల మరణం పట్ల రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, జమాతే ఇస్లా మీ రాష్ట్ర అధ్యక్షుడు హామీద్ మహమ్మద్ ఖాన్, వక్ఫ్ బోర్డు సభ్యుడు మలిక్ మోతసిమ్ ఖాన్, ఎంఐఎం ఉమ్మడి జిల్లా ఇంచార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జమతే ఇస్లామీ హింద్ జిల్లా బాధ్యుడు మహమ్మద్ ఖైరోద్దీన్, మాను ప్రొఫెసర్ డాక్టర్ ఫహిముద్దీన్ అహ్మద్, జమాతే ఇస్లామీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షోయబ్ లతీఫ్, మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మహమ్మద్ ఇర్ఫాన్ మొయినుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, 4వ డివిజన్ కార్పొరేటర్ అలిబాబా, టిఆర్ఎస్ నేత సాజిద్ ఖాన్, జగిత్యాల జెఐహెచ్ అధ్యక్షుడు షోయబ్ తాలిబ్, క్రిసెంట్ విద్యా సంస్థల ఛైర్మన్ వజహతుల్లా ఆయాజ్, చిగురువ రామిడి తహశీల్దార్ ముబిన్ అహ్మద్, టీచర్లు సయ్యద్ మొయిన్ అహ్మద్, జుబేర్ అహ్మద్, డాక్టర్ షకీల్ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకుట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలి- ఇన్స్పెక్టర్ వెంకటేష్